సాక్షి విశాఖపట్నం

గురువారం । 27 । జూలై । 2023



కీర్తి చాటిన భారతీయం

భారతీయం పేరిట కళాభారతి ఆడిటోరియంలో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు ఘనంగా జరిగాయి. 8లో



నర్సరీలకు లైసెన్స్!

నర్సరీలకు లైసెన్స్ తప్పనిసరి అయింది. ఏర్పాటు కోసం నామమాత్రంగా రూ.వెయ్యి చలానాగా చెల్లించాల్సి ఉంటుంది. 8లో



విశాఖలో క్రికెట్ పండగ

విశాఖకు క్రికెట్ పండగ వచ్చేస్తోంది. భారత జట్టు సొంతగడ్డపై ఆడే 2 మ్యాచ్‌లకు వైఎస్సార్ స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుంది. 8లో

న్యూస్‌రీల్

పక్కాగా ఓటరు నమోదు పరిశీలన



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న జేసీ విశ్వనాథన్

సాక్షి, విశాఖపట్నం: కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జరుగుతున్న ఓటరు నమోదు పరిశీలన ప్రక్రియకు అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం జేసీ సమావేశమయ్యారు. ఇంటింటా ఓటరు సర్వే పక్కా నిర్వహించాలని అధికారులకు సూచించారు. వేరే ప్రాంతాలకు వలస వెళ్లిన వారి నుంచి ఫారం-8 తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ మేరకు అన్ని పార్టీల ప్రతినిధులు తగిన చర్యలు తీసుకోవాలని.. బూత్ లెవల్ అధికారులతో పాటు అన్ని పార్టీల బీఎల్‌వోలు కలిసి క్షేత్ర స్థాయి పరిశీలనకు హాజరు కావాలని కోరారు. టీడీపీ నుంచి గోపాల్‌రెడ్డి, ఆమ్ ఆద్మీ నుంచి మధుకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇనార్బిట్ మాల్ శంకుస్థాపన ఏర్పాట్ల పరిశీలన



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: ఇనార్బిట్ మాల్ శంకుస్థాపన ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. 45వ వార్డు కైలాసపురం రోడ్డులో ఏర్పాటు చేయనున్న ఇనార్బిట్ మాల్ శంకుస్థాపన పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో తొలి ఇనార్బిట్ మాల్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆగస్టు ఒకటో తేదీన శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున శంకుస్థాపన ప్రాంగణం, పార్కింగ్, స్టేజ్, రెస్ట్‌రూమ్ తదితర ప్రదేశాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని, సమయం తక్కువగా ఉన్నందున పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, పర్యవేక్షక ఇంజినీర్ వేణుగోపాల్, ఏసీపీ రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌జెండర్ల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1091



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి: ట్రాన్స్‌జెండర్లకు ఏ సమస్య వచ్చినా స్వాభిమాన్ టోల్‌ఫ్రీ నంబర్ 1091కు ఫోన్ చేయాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం. త్రివిక్రమ్ వర్మ సూచించారు. ఆంధ్రప్రదేశ్ నేర పరిశోధన విభాగం (సీఐడీ) ప్రవేశపెట్టిన స్వాభిమాన్ ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ ప్రొటెక్షన్ హెల్ప్‌లైన్ పోస్టర్‌ను బుధవారం పోలీస్ సమావేశ మందిరంలో సీపీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లు ఏదైనా సమస్యతో పోలీస్‌స్టేషన్‌కు వస్తే వెంటనే వారి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అలాగే ట్రాన్స్‌జెండర్లు ట్రాఫిక్ కూడళ్లు, శుభ కార్యాల వద్ద బలవంతపు వసూళ్లు చేయకూడదని చెప్పారు. నీ తోడు సొసైటీ ఫర్ ట్రాన్స్‌జెండర్ పర్సన్స్ ప్రతినిధి డాక్టర్ సిస్టర్ అమితా మాట్లాడుతూ ప్రతి మనిషికీ గౌరవంగా జీవించే హక్కు ఉందని తెలిపారు. వారు ఏదైనా ఇబ్బందులు ఎదుర్కొని పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వస్తే.. వారి జెండర్ అడగకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బాలల సాహస పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంవీపీకాలనీ: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాలల సాహస పురస్కారానికి కేంద్ర మహిళ, శిశు అభివృద్ధి శాఖ దరఖాస్తులను ఆహ్వానిస్తోందని జిల్లా సీడీపీవో రమేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇతరుల కోసం అసాధారణమైన ధైర్యసాహసాలు, నిస్వార్థమైన చర్యలు చేసిన బాలబాలికలకు ఏటా కేంద్రం ఈ అవార్డులను ప్రదానం చేస్తున్నదని పేర్కొన్నారు. 18 ఏళ్ల లోపు చిన్నారులు ఈ అవార్డులకు అర్హులని తెలిపారు. https://awards.gov.in వెబ్‌సైట్ ద్వారా ఆయా బాలలు నేరుగా గాని, ఉపాధ్యాయుల ద్వారా గాని ఆగస్టు 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

కుండపోత

- విశాఖలో 11.1 సెం.మీల వర్షపాతం
- నేడూ భారీ వర్షాలకు అవకాశం



కోతకు గురైన ఆర్కే బీచ్



రామకృష్ణ జంక్షన్ వద్ద నీటిలో ఆర్టీసీ బస్సు



వర్షపు నీటిలో చిక్కుకున్న కారు

సాక్షి, విశాఖపట్నం: వరుణుడు వదలకుండా వర్షాలను కురిపిస్తున్నాడు. మూడు రోజులుగా కుండపోతను తలపిస్తూ కుమ్మరిస్తున్నాడు. ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వానలు బుధవారం మరింత ఉధృతమయ్యాయి. కుంభవృష్టి వర్షాలను తలపించాయి. అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకంటే విశాఖ జిల్లాలో అత్యంత భారీ వర్షం కురిసింది. ఈ సీజనులో అత్యధికంగా సీతమ్మధారలో 11.1 సెం.మీల వర్షపాతం నమోదైంది. ఇంకా నగరంలోని పలు ప్రాంతాలతో పాటు శివారుల్లోనూ జడివాన వెల్లువెత్తింది. ఉదయం మేఘాలు, చిరుజల్లులకే పరిమితమైన వాతావరణం మధ్యాహ్నానికి ఒక్కసారిగా మారిపోయింది. మధ్యాహ్నం 3 గంటల నుంచి మొదలైన భారీ వర్షం రాత్రి 7 గంటల వరకు కురుస్తూనే ఉంది. ప్రధానంగా సీతమ్మధార, అక్కయ్యపాలెం, రైల్వే న్యూకాలనీ, మహారాణిపేట, పూర్ణామార్కెట్, ప్రసాద్‌గార్డెన్స్, కోటవీధి, లక్ష్మీనగర్, పాతపోస్టాఫీసు, పెదవాల్తేరు, మధురవాడ, సాగర్‌నగర్, జూపార్కు, బీచ్‌రోడ్డు తదితర ప్రాంతాలు వర్షానికి బాగా ప్రభావితమయ్యాయి. భారీ వర్షానికి నగరంలోని రోడ్లన్నీ నీటితో ప్రవహిస్తూ కనిపించాయి. పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోని వర్షపు నీరు చేరింది. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు నీటిని బయటకు తోడుకోవడానికి నానా ఇబ్బందులు పడ్డారు. వర్షం తీవ్రతకు ఆర్కే బీచ్‌లోని సముద్రతీరం భారీగా కోతకు గురైంది.

నేడూ కొనసాగనున్న వర్షాలు

ఉమ్మడి విశాఖలో గురువారం కూడా వర్షాలు కొనసాగనున్నాయి. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, అక్కడక్కడ భారీ వర్షాలు కురవనున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో గంటకు 45-55 కి.మీల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, సముద్రం అలజడిగా ఉండడం వల్ల మత్స్యకారులు చేపలవేటకు వెళ్లవద్దని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం హెచ్చరించింది.



భారీ వర్షంలో నీట మునిగిన ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం పరిసర ప్రాంతాలు

నేడు పాఠశాలలకు సెలవు

విశాఖ విద్య : జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని అన్ని స్కూళ్లకు గురువారం సెలవు ప్రకటించినట్లు డీఈవో ఎల్.చంద్రకళ తెలిపారు. గురువారం భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున సూచన మేరకు ముందు జాగ్రత్తల్లో భాగంగా సెలవు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

కలెక్టరేట్‌లో	0891-2590100, 102
జీవీఎంసీలో	1800-4250-0009 0891-28691106
ఆర్డీవో కార్యాలయం, విశాఖ	0891-2562977
ఆర్డీవో కార్యాలయం, భీమిలి	08933-293990

జిల్లాలోని 11 తహసీల్దార్ కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు.

యంత్రాంగం అప్రమత్తం

సాక్షి, విశాఖపట్నం : అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగా అప్రమత్తమైంది. వర్షాల వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటోంది. కలెక్టరేట్, జీవీఎంసీ సహా రెవిన్యూ డివిజనల్ అధికారి, తహసీల్దారు కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. తహసీల్దార్లు, ఇతర మండల స్థాయి అధికారులు, సచివాలయ వార్డు స్థాయి ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. భారీ వర్షాల వల్ల సమాచార వ్యవస్థకు అంతరాయం కలగకుండా జనరేటర్లను సిద్ధం చేయాలని, నిత్యావసర సరకులు, గ్యాస్ నిల్వలు తగిన స్థాయిలో అందుబాటులో ఉంచాలని పౌరసరఫరాల శాఖ అధికారులకు స్పష్టం చేశారు. పరిశుభ్రమైన మంచినీటిని ప్రజలకు అందించాలని మున్సిపల్, పంచాయతీ అధికారులను ఆదేశించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోని బలగాలను అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగించడానికి, నేవీ, కోస్ట్‌గార్డుల రెస్క్యూ సిబ్బందిని సన్నద్ధం చేశారు.



లక్ష్మీనగర్‌లో ఇళ్లలోకి వచ్చిన వర్షం నీరు



పూర్ణామార్కెట్ దరి బౌడారా రోడ్డులో మోకాలి లోతులో వర్షం నీరు



శ్రీకన్య థియేటర్ బయట నీటమునిగిన బైక్‌లు



బీచ్‌రోడ్డులో రహదారులపై ప్రవహిస్తున్న వర్షం నీరు

గంజాయికి చెక్ చెప్పండి...

- పెడ్లర్లపై దృష్టి పెట్టండి
- నేర సమీక్ష సమావేశంలో సీపీ త్రివిక్రమ్ వర్మ ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ త్రివిక్రమ్‌వర్మ

దొండపర్తి (విశాఖ దక్షిణ) : డ్రగ్ పెడ్లర్లపై గట్టి నిఘా పెట్టి వారిని పట్టుకోవాలని, గంజాయి రవాణాకు పూర్తి స్థాయిలో అడ్డుకట్ట వేయాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్‌వర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం పోలీస్ సమావేశ మందిరంలో డీసీపీలు విద్యాసాగర్‌నాయుడు, ఆనందరెడ్డితో పాటు ఏడీసీపీల నుంచి ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులతో నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనరేట్ పరిధిలో ప్రతి పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ల పనితీరును సీపీ పరిశీలించారు. ఎస్ఈబీ బృందాలుగా ఏర్పడి విద్యాసంస్థల వద్ద నిఘా పెట్టాలని, డ్రగ్స్ వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రధాన ప్రాంతాల్లో బ్యానర్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.

రహదారి భద్రతపై మరింత దృష్టి

నగరంలో గత నెల జరిగిన రోడ్డు ప్రమాదాలు, మరణాల సంఖ్యను పరిశీలించి ఆయా రహదారుల వద్ద చేపట్టాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో యాక్టివ్‌గా ఉన్న రౌడీషీటర్ల వివరాలు, వారిపై నిఘా చర్యలను ఆరా తీశారు. మహిళలపై వేధింపులు, మిస్సింగ్ కేసుల్లో జాప్యం లేకుండా తక్షణం స్పందించాలన్నారు. పోక్సో కేసులపై ఆరా తీశారు. నైట్ బీట్స్, పెట్రోలింగ్ చేసే అధికారులు, సిబ్బంది స్పీడ్ డ్రైవింగ్ లేకుండా విధులు నిర్వహించాలని, రాత్రి పూట నిఘా పటిష్టం చేయాలని, వీఎంఎస్ (విజిటర్స్ మానిటరింగ్ సిస్టమ్)కు పూర్తిగా లా-ఆర్డర్, క్రైమ్ సిబ్బందిని వినియోగించి నిందితులను వేగంగా గుర్తించాలని సూచనలు చేశారు. నగరంలో బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌లను పూర్తిగా నిరోధించాలన్నారు.

సైబర్ క్రైమ్ విభాగం బలోపేతం

సైబర్ క్రైమ్ విభాగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కొత్త సాఫ్ట్‌వేర్‌లు వినియోగించుకోవాలని సీపీ చెప్పారు. వివిధ పోలీసు స్టేషన్లలో పెండింగ్ కేసుల వివరాలు తెలుసుకుని ఆయా కేసులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. క్రైం, ట్రాఫిక్ విభాగాల పనితీరును సమీక్షించారు. కోర్టు తీర్పు వెలువరించిన కేసుల వివరాలు తెలుసుకున్నారు. లోక్ అదాలత్ ద్వారా మరిన్ని ఎక్కువ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

మంత్రి అమర్‌నాథ్‌ను కలిసిన పరిశ్రమల శాఖ కార్యదర్శి



మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్

మహారాణిపేట: రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను పరిశ్రమల శాఖ కార్యదర్శిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఎన్. యువరాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌లో మంత్రిని కలిసి పలు విషయాలు చర్చించారు.

8 మంది కారుణ్య నియామకం

మహారాణిపేట: వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ చనిపోయిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు బుధవారం జిల్లా యంత్రాంగం కారుణ్య నియామకం చేపట్టింది. అర్హతలను బట్టి నియామక ఉత్తర్వులను బుధవారం జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ అందజేశారు. మొత్తం 8 మందికి గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉద్యోగాలు కల్పించారు.

29న జిల్లా ఇన్‌చార్జి మంత్రి రజని రాక

సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గాల అభివృద్ధిపై సమీక్ష నిర్వహించేందుకు ఈ నెల 29న జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని నగరానికి రానున్నారు. ఆ రోజు కలెక్టరేట్ సమావేశ మందిరంలో తూర్పు, దక్షిణ నియోజకవర్గాల అభివృద్ధి పనులు, సమస్యలపై ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్షించనున్నారు. తూర్పు, దక్షిణ నియోజకవర్గ పరిధిలో జీవో నం.72, 36/84, జీవో నం.60 పై చర్చించనున్నారు. సచివాలయ భవన నిర్మాణాలు, జోడుగుళ్లపాలెం వద్ద మత్స్యకారులకు షెడ్ల నిర్మాణం, 20, 21, 22 వార్డుల్లో పశువుల పెంపకానికి అవసరమైన షెడ్స్‌కు స్థల కేటాయింపులు, కేఆర్ఎం కాలనీలోని ప్రభుత్వ భూముల రికార్డుల్లో ఉన్న సమస్యల పరిష్కారం, పితాని దిబ్బ భూ సమస్య, ముడసర్లోవ డంపింగ్ యార్డు తరలింపు, జాలారిపేట వద్ద వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం, యూపీహెచ్‌సీలు, పీహెచ్‌సీల నిర్మాణాలు, నాడు-నేడు పనులు, గడప గడపకు మన ప్రభుత్వం పనులపై సమీక్ష జరగనుంది. దక్షిణ నియోజకవర్గ పరిధిలో రీడింగ్‌రూమ్ నుంచి బీచ్‌రోడ్డు వరకు 30 అడుగుల రోడ్డు విస్తరణ, ఇందిరా ప్రియదర్శిని మైదానం అభివృద్ధి, జనతా బజార్ ఆధునికీకరణ, ఇసుకకొండ సత్యనారాయణ స్వామి ఘాట్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయడం, వివిధ వార్డుల్లో కమ్యూనిటీ హాళ్లు, దోబీఖానాల నిర్మాణాలు, లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పంపిణీ, వెంకటేశ్వర మెట్ట దేవస్థానం పరిధిలోని భూ క్రమబద్ధీకరణ, టిడ్కో ఇళ్ల నిర్మాణం, స్కీమ్ ఇళ్ల మరమ్మతులపై సమీక్షించనున్నారు.

స్థాయీ సంఘ సమావేశం నేడు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం గురువారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించనున్నారు. మేయర్, స్థాయీ సంఘ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన ఉదయం 11 గంటల నుంచి సమావేశం ప్రారంభం కానుంది. మొత్తం 39 అంశాలను సభ్యులు చర్చించనున్నారు. కాగా.. గత స్థాయీ సభ్యుల పదవీ కాలం మంగళవారంతో ముగిసింది.

నూతన సభ్యులతో తొలి సమావేశం

ఇటీవల స్థాయీ సంఘానికి సంబంధించి ఎన్నిక నిర్వహించారు. నూతన స్థాయీ సభ్యులుగా అక్కరమాని పద్మ, గుడ్ల విజయసాయి, ఉరుకూటి నారాయణరావు, కోడిగుడ్ల పూర్ణిమ, కంటిపాము కామేశ్వరి, చల్లా రజని, బల్ల లక్ష్మణరావు, భూపతిరాజు సుజాత, బట్టు సూర్యకుమారి, పీలా లక్ష్మీ సౌజన్య ఎన్నికయ్యారు. వీరికిదే తొలి సమావేశం. పలు అభివృద్ధి పనులకు సంబంధించి స్థాయీ చైర్‌పర్సన్‌తో చర్చించి ఆమోదించనున్నారు.

ఆదర్శ నగరంగా విశాఖ

- కార్మెల్ నగరంతో ఒప్పందం కొత్త అధ్యాయానికి శ్రీకారం
- మేయర్ గొలగాని హరి వెంకటకుమారి వెల్లడి



వర్చువల్‌లో అవగాహన ఒప్పందంపై సంతకం చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: విశాఖను ఆదర్శవంత నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. ఈ మేరకు అమెరికాలోని కార్మెల్ నగరం(ఇండియానా రాష్ట్రం)తో సిస్టర్ సిటీస్‌గా ముందుకెళ్లేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. కార్మెల్ మేయర్ జేమ్స్ బ్రెయినార్డ్‌తో బుధవారం జరిగిన వర్చువల్ సదస్సులో ఒప్పంద పత్రాలపై సంతకం చేశారు. ఈ సందర్భంగా మేయర్ హరి వెంకటకుమారి మాట్లాడుతూ విశాఖపట్నం, కార్మెల్ నగరాల మధ్య విజ్ఞాన, సాంస్కృతిక విలువల మార్పిడి చేసుకోవడానికి ఇది ఓ గొప్ప అవకాశమన్నారు. సోదరి నగరాల విధానం ఒకరి నుంచి మరొకరు అనేక విషయాలు నేర్చుకోవడానికి ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. ఈ ఒప్పందం సాంస్కృతిక మార్పిడి, ఆర్థికాభివృద్ధి, అంతర్జాతీయ సహకారం తదితర అవకాశాలు సృష్టించగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ముందుగా కార్మెల్ మేయర్‌కు స్వాగతం పలికారు. ఈ ఒప్పందంతో రెండు నగరాల చరిత్రలో కొత్త అధ్యాయం ప్రారంభమవుతుందన్నారు. వాతావరణ మార్పులకు ఎక్కువగా ప్రభావమవుతున్న నగరంగా విశాఖపట్నం ఉందని, అందుకు తగిన చర్యలను తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్మెల్ మేయర్ భారతదేశ పర్యటన అనుభవాలు పంచుకున్నారు. కార్యక్రమంలో ఇండియా-యూఎస్ఏ కౌన్సిల్ తరఫున ప్రవాస భారతీయులు రాజు చింతల, పవన్ వర్మ పాల్గొన్నారు.

10 ఆటోలు...100 ట్రిప్పులు

- కోస్టల్ బ్యాటరీ టు సాగర్‌నగర్
- ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు..
- రోజుకు 600 మందికి ఉచిత ప్రయాణం
- జీవీఎంసీ ఉచిత ఆటో సర్వీస్‌కు విశేష స్పందన

బీచ్‌రోడ్డు : జీవీఎంసీ గత నెల ప్రారంభించిన ఉచిత ఆటో సర్వీసులకు నగరవాసుల నుంచి విశేష స్పందన లభిస్తుంది. జీవీఎంసీ ఎకో వైజాగ్ కార్యక్రమంలో భాగంగా విద్యుత్ ఆటోలను నగరవాసుల కోసం అందుబాటులోకి తీసుకొచ్చింది. మొదట కోస్టల్ బ్యాటరీ నుంచి అప్పుఘర్ వరకు ఉచిత ఆటో సర్వీసులను ప్రారంభించిన జీవీఎంసీ ఇప్పుడు సాగర్‌నగర్ వరకు పొడిగించింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సర్వీసులు నడుపుతోంది.

రోజుకు వంద ట్రిప్పులు : ఉచిత ప్రయాణం కల్పించేందుకు జీవీఎంసీ 10 విద్యుత్ ఆటోలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఒక్కో ఆటో రోజుకు 10 ట్రిప్పులు (వెళ్లి రావడం) వేస్తుంది. ఒక ట్రిప్పులో వెళ్లేటపుడు ముగ్గురు వచ్చేటప్పుడు ముగ్గురు ప్రయాణికులను తీసుకొని వెళ్తారు. ఇలా రోజుకు 10 ఆటోలు వంద ట్రిప్పుల ద్వారా సుమారు 600 మందికి ఉచిత ప్రయాణం అందిస్తున్నారు.

అందరికీ ఉచితమే...

మొదట ఈ వాహనాలను కేవలం దివ్యాంగులు, వృద్ధులు, బాలింతల కోసం మాత్రమే ఉచితంగా నడిపే వారు. అయితే అంతంత మాత్రమే స్పందన రావడంతో వృథాగా సర్వీసులు నడపాల్సి వచ్చేది. దీంతో అందరికీ ఉచిత ఆటో సేవలను జీవీఎంసీ ప్రారంభించింది. దీంతో ఉచిత ఆటో సర్వీసులు ఫుల్‌గా నడుస్తున్నాయి.



కోస్టల్ బ్యాటరీ వద్ద వేచి ఉన్న ఆటోలు

రద్దీ పెరిగింది..



సర్వీసులు ప్రారంభించిన మొదటిలో పెద్దగా స్పందన లేదు. ఇప్పుడు చాలా రద్దీ పెరిగింది. రోజుకు 10 ట్రిప్పులు వేయడం జరుగుతుంది. ఉదయం ఐదు ట్రిప్పులు వేసి భోజనం చేసి ఆటో బ్యాటరీ మార్చుతాం. మరలా ఐదు ట్రిప్పులు వేస్తాం. ఈ సర్వీసుల పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారు. కోస్టల్ బ్యాటరీ వద్ద ఐదు ఆటోలు, సాగర్‌నగర్ బీచ్ వద్ద ఐదు ఆటోలు ఏర్పాటు చేయడం జరిగింది.

– శ్రీనివాసరావు ఆటో డ్రైవర్

జీవీఎంసీ సేవలు హర్షణీయం



కలెక్టర్ ఆఫీస్ దగ్గరలో పని ఉండి వెళ్లాను. ఉచిత ఆటో సర్వీసు ద్వారానే వెళ్లాను. సాధారణంగా ఆటోలకు ఒక వైపు చార్జి రూ.30 తీసుకుంటారు. ఈ ఉచిత ఆటో సర్వీసుల ద్వారా రూ. 60 ఆదా అయింది. చాలా సంతోషంగా ఉంది. జీవీఎంసీ ఇటువంటి సర్వీసులు ప్రారంభించడం హర్షణీయం

– పి.నూకరత్నం, అప్పుఘర్

క్లుప్తంగా

విజయవంతంగా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

విశాఖ విద్య: పాఠశాల విద్యాబోధనలో తీసుకొస్తున్న మార్పులపై ఉపాధ్యాయులకు అవగాహన పెంచేందుకు రెండు రోజులుగా జిల్లాలో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు విజయవంతమయ్యాయి. బుధవారం సబ్జెక్టు టీచర్లకు అవగాహన సదస్సులు నిర్వహించారు. అడవివరం జెడ్పీ హైస్కూల్లో ఏర్పాటు చేసిన కాంప్లెక్స్ సమావేశంలో హిందీ సబ్జెక్టుకు సంబంధించి చినగదిలి, భీమిలి మండలాల పరిధిలోని ఉపాధ్యాయులు హాజరయ్యారు. కాంప్లెక్స్ చైర్మన్ ఇమంది పైడిరాజు మాట్లాడుతూ విద్యా బోధనలో మెలకువలు తెలుసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిగా ఉండాలన్నారు. విద్యార్థులకు ఆకట్టుకునే రీతిలో సులభమైన బోధన పద్ధతులు అవలంబించాలన్నారు. సమూదాయానికి కార్యదర్శులుగా జి.కృష్ణ, ప్రసాదరావు వ్యవహరించారు. ఐఎఫ్‌పీ వినియోగం, డిజిటల్ క్లాస్ రూమ్‌ల నిర్వహణ, ఫార్మెటివ్, సమ్మెటివ్ పరీక్షలు, మోడల్ లెసన్ ప్లాన్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ వీడియో సందేశాన్ని ఉపాధ్యాయులంతా తిలకించారు.

శతాధిక వృద్ధురాలు వెంకాయమ్మ మృతి



వెంకాయమ్మ(ఫైల్)

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు కొండయ్యవలసకు చెందిన శతాధిక వృద్ధురాలు కంచిపాటి వెంకాయమ్మ కాలం చేశారు. వెంకాయమ్మ వయసు ప్రస్తుతం 102 సంవత్సరాలు. ఈ వయసులో కూడా తన పనులు తాను చేసుకునే ఆమె.. ఏడాది కిందట కాలు జారిపడిపోవడంతో అప్పటి నుంచి కొద్దిగా ఇబ్బంది ఎదుర్కొన్నారు. కొద్ది రోజులుగా ఆరోగ్యం సహకరించకపోవడంతో బుధవారం ఉదయం ఆమె మృతి చెందారు. వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, జగన్నాథ స్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ దివంగత కంచిపాటి గురుమూర్తి మాతృమూర్తి వెంకాయమ్మ. యువ రచయిత వెంకట నరసింహమూర్తికి నాన్నమ్మ. ఆమె మృత దేహానికి పలువురు నాయకులు, గ్రామపెద్దలు నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు.

నర్సరీలకు లైసెన్స్!

- ఏర్పాటుకు రూ.వెయ్యి చలానా తప్పనిసరి
- విశాఖపట్నం జిల్లాలో 57 నర్సరీలు
- వీటి పర్యవేక్షణలో ఉద్యానశాఖ అధికారులు
- మొక్కల నాణ్యత, మోసాలకు అడ్డుకట్టే లక్ష్యం

సాక్షి, విశాఖపట్నం: నర్సరీలకు లైసెన్స్ తప్పనిసరి అయింది. ఎవరైనా లైసెన్స్ లేకుండా నర్సరీ నడిపినా, కొత్తగా ఏర్పాటు చేసినా సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకునేందుకు వీలుంటుంది. నర్సరీ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి నామమాత్రంగా రూ.వెయ్యి చలానాగా చెల్లించాల్సి ఉంటుంది. ఇలా చెల్లించిన వారికి ఉద్యానశాఖ లైసెన్స్ జారీ చేస్తుంది. రిజిస్ట్రేషన్ చట్టం 2010 ప్రకారం ఈ నిబంధన అమలులో ఉంది. ఇలా లైసెన్సింగ్ విధానాన్ని అమలు చేయడం వల్ల మొక్కల నాణ్యతకు నర్సరీ నిర్వాహకుల నుంచి జవాబుదారీతనం ఉంటుంది. ప్రస్తుతం విత్తన విక్రయ సంస్థలకు లైసెన్స్ తప్పనిసరి. వీరు విక్రయించిన విత్తనాల్లో కల్తీ లేదా నాణ్యతా లోపం ఉన్నా, మొలకెత్తడంలో తేడాలున్నా సంబంధిత విక్రయదారుడు/సంస్థ బాధ్యులవుతున్నారు. ఇప్పుడు నర్సరీ మొక్కల విషయంలోనూ అదే విధానం అమలవడంతో కొనుగోలుదారునికి నాణ్యమైన మొక్కలు అందే వీలుంటుంది. అంతేకాదు మొక్కల్లో మోసాలకు అడ్డుకట్ట పడనుంది. లైసెన్స్ విధానం వల్ల ఎవరైనా మొక్కల నాణ్యతపై ఫిర్యాదు చేయడానికి వీలవుతుంది. విశాఖ జిల్లాలో ఉన్న 57 నర్సరీలకు లైసెన్సులున్నాయి. కొత్తగా వీటిని ఏర్పాటు చేసుకోదలచిన వారు విధిగా లైసెన్స్ పొందాలని ఉద్యానశాఖ అధికారులు ఆయా ప్రాంతాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఇంకా ఎవరైనా అనధికారికంగా నర్సరీలను నడుపుతున్నట్టయితే వారూ రూ.వెయ్యి చెల్లించి లైసెన్సు తీసుకోవాలని వీరు సూచిస్తున్నారు. కొత్తగా నర్సరీలు ఏర్పాటు చేయాలనుకునే వారు సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో పని చేస్తున్న గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకుల ద్వారా లైసెన్సులను పొందవచ్చని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. మొక్కల నర్సరీలకే కాదు.. కూరగాయల నర్సరీలకు కూడా లైసెన్సులు పొందాల్సిందే. ఇతర ప్రాంతాల నుంచి మొక్కలను కొనుగోలు చేసి స్థానికంగా విక్రయించాలన్నా (వీటిని శాటిలైట్ నర్సరీలుగా పేర్కొంటారు) లైసెన్స్ తప్పనిసరని జిల్లా ఉద్యానశాఖ అధికారి మన్మథరావు 'సాక్షి'కి తెలిపారు. నర్సరీలకు లైసెన్సుల ఆవశ్యకతపై సిబ్బంది ద్వారా అవగాహనా కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇకపై లైసెన్సులు లేకుండా నడిపే నర్సరీలను చూసీ చూడనట్టు వ్యవహరించే పరిస్థితి ఉండదని చెప్పారు.



సీతమ్మధార రైతుబజారులో పూల మొక్కల నర్సరీ

ఉద్యానశాఖ పర్యవేక్షణ

నర్సరీలు ఏర్పాటుపై ఉద్యానశాఖ పర్యవేక్షణ ఉంటుంది. సంబంధిత నర్సరీకి నీటి సదుపాయం ఉండాలి. ఆ నర్సరీలో లభ్యమయ్యే మొక్కల వివరాలను తెలిపే బోర్డు ఏర్పాటు చేయాలి. నర్సరీ పరిసరాల్లో 3–5 మీటర్ల దూరం వరకు కలుపు మొక్కలు లేకుండా చూడాలి. మొక్కలు అమ్మేటప్పుడు సంబంధిత రైతు/ కొనుగోలుదారునికి తప్పనిసరిగా రసీదు ఇవ్వాలి. ఆ బిల్లులో రకాలు, మొక్కల సంఖ్య, ధర వంటివి పొందుపరచాలి.

చిట్టీ.. రూ.కోటిపైగా టోపీ..!

- వెలుగు చూసిన మరో ఘరానా మోసం
- పీఎం పాలెం పోలీసులను ఆశ్రయించిన బాధితులు

పీఎం పాలెం: పీఎం పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో చిట్టీల మోసం వెలుగు చూసింది. పాటదారులకు చెల్లించాల్సిన సుమారు రూ.కోటికిపైగా మొత్తాన్ని చెల్లించకుండా రాత్రికి రాత్రే చిట్టీల నిర్వాహకుడు కుటుంబంతో సహా బిచాణా ఎత్తేసాడు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బొచ్చల మురళి అనే వ్యక్తి జీవీఎంసీ 7వ వార్డులోని వాంబే కాలనీలో కుటుంబంతో నివసిస్తున్నాడు. నగరంలోని ఓ హోటల్లో పనిచేస్తున్నాడు. దీర్ఘ కాలంగా ఇక్కడ నివాసం ఉంటున్న మురళి స్థానికంగా చిట్టీలు నిర్వహిస్తున్నాడు. డాబూ దర్పంతో ఉండే అతనిని నమ్మి వాంబేకాలనీ, మధురవాడ ప్రాంతాల వారే కాక నగరంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన అనేక మంది అతని వద్ద చిట్టీలు కట్టారు. సుమారు 100 మందికి పైగా రూ.లక్ష నుంచి రూ.15 లక్షల వరకూ చిట్టీలు కడుతున్నారు. పాడిన వెంటనే పాటదారులకు సొమ్ము చెల్లించకుండా అధిక వడ్డీ ఇస్తానంటూ వారిని నమ్మబలికి కొత్తగా చిట్టీలు వేసేవాడు. ఈ క్రమంలో అతడు కొంతమంది పాటదారులకు కోటి రూపాయలకు పైగా చెల్లించవలసి ఉంది. శ్రావణ మాసం వరలక్ష్మీ చిట్టీల సొమ్మును చిట్టీలు కట్టిన వారికి ఏక మొత్తంలో ఈ నెలలో చెల్లించాల్సి ఉంది. అలాగే గతంలో పాడుకున్నవారు కూడా తమ సొమ్ము చెల్లించాలని అతనిపై ఒత్తిడి తెచ్చారు. ఈ నేపథ్యంలో గత శనివారం రాత్రి మురళి కుటుంబంతో సహా పరారయ్యాడు. ఎప్పుడూ వీధిలో హంగూ ఆర్భాటంతో కనిపించే మురళి అసలు ఉనికే లేకపోవడంతో పలువురు అతని గురించి వాకబు చేశారు. ఫోను చేస్తే స్విచ్ ఆపేసి ఉంది. దీంతో మోసపోయామని గ్రహించిన కొంతమంది చిట్టీ బాధితులు పీఎంపాలెం పోలీసులను ఆశ్రయించారు. జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేశారు. దీనిపై పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, కేసు నమోదు చేసి తగు చర్యలు తీసుకుంటామని సీఐ రామకృష్ణ తెలిపారు.

ఒకరిని గాయపరిచిన ఇద్దరికి ఏడేళ్ల జైలు

విశాఖ లీగల్: బీచ్‌రోడ్డులో ఓ వ్యక్తిని గాయపరిచి దోపిడీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులకు ఏడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ నగరంలోని మెట్రోపాలిటన్ సెషన్ జడ్జి ఎం.వెంకటరమణ తీర్పునిచ్చారు. జరిమానా చెల్లించిన పక్షంలో మరో 3 నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ టి.పాపారావు అందించిన వివరాలివీ.. నిందితులు వాడమొదుల సతీష్, బాకూరి మోహన్‌రాజు 2014 నవంబర్‌లో బీచ్ రోడ్డులో ఒంటరిగా ఉన్న వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని దోపిడీకి పాల్పడేవారు. నగదు, బంగారం, ఇతర వస్తువులు తీసుకుని వారిని గాయపరిచేవారు. ఈ క్రమంలో ఫిర్యాదిపై కూడా వైఎంసీఏ దగ్గర దాడి చేసి, నగదు దోచుకుపోయారు. ఈ ఘటనపై బాధితుడు మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నిందితులను అరెస్టు చేసిన త్రీటౌన్ పోలీసులు నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

రాజభాష గౌరవ్ సమ్మాన్ అవార్డుల ప్రదానం



హెచ్‌పీసీఎల్ ఈడీకి షీల్డు అందజేస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ భట్

ఉక్కునగరం: విశాఖలోని ప్రభుత్వ రంగ పరిశ్రమల్లో రాజభాష అమల్లో ప్రతిభ చూపిన వారికి బుధవారం రాజభాష గౌరవ్ సమ్మాన్ అవార్డులను ప్రదానం చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన నగర అధికార భాషా అమలు కమిటీ (టోలిక్) సమావేశంలో టోలిక్ చైర్మన్, స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ మాట్లాడుతూ 2021–22 సంవత్సరానికి రాజభాష కీర్తి పురస్కారాన్ని మళ్లీ అందుకోవడం ద్వారా టోలిక్‌కు ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు. ఇందుకు సహకరించిన సభ్య సంస్థలను అభినందించారు. ఈ సందర్భంగా హోమ్ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికార భాష డైరెక్టర్ అనిర్బన్ కుమార్ బిశ్వాస్ అధికార భాష అమలు పురోగతిని సమీక్షించారు. కేటగిరీ–1లో హెచ్‌పీసీఎల్–విశాఖ రిఫైనరీ, ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, బీడీఎల్, విశాఖ పోర్టులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, ప్రత్యేక బహుమతులు అందజేశారు. కేటగిరీ–2లో హెచ్‌పీసీఎల్–విశాఖ ప్రాంతీయ కార్యాలయం, ఈసీజీసీ లిమిటెడ్, సెయిల్ బ్రాంచ్ కార్యాలయం, గెయిల్, ఎఫ్‌సీఐ, ఈఎస్‌ఐలు బహుమతులు సాధించాయి. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ హిందీ మ్యాగజైన్ 'విశాఖ ధార'ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండే, జీఎం లలన్‌కుమార్, టి.హైమావతి, వి సుగుణ పాల్గొన్నారు.

విశాఖలో క్రికెట్ పండగ

- నవంబర్‌లో టీ–20, వచ్చే ఫిబ్రవరిలో టెస్ట్ మ్యాచ్
- క్రీడాభిమానుల సంతోషం



విశాఖ స్పోర్ట్స్: విశాఖకు క్రికెట్ పండగ వచ్చేస్తోంది. భారత జట్టు సొంతగడ్డపై ఆడే రెండు అంతర్జాతీయ మ్యాచ్‌లకు వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ–వీడీసీఏ స్టేడియం ఆతిథ్యం ఇవ్వనుంది. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ జట్లు వైఎస్సార్ స్టేడియంలో మరోసారి విశాఖ అభిమానులను ప్రత్యక్షంగా అలరించనున్నాయి. ఆస్ట్రేలియాతో టీ–20 సిరీస్‌లో తొలిమ్యాచ్ విశాఖలో ప్రారంభం కానుండగా.. టెస్ట్ సిరీస్‌లో భాగంగా ఇంగ్లాండ్‌తో జట్టుతో రెండో మ్యాచ్‌ను ఇక్కడే ఆడనుంది. ప్రపంచ వరల్డ్ క్రికెట్ కప్ ముగిసిన వెంటనే ఆస్ట్రేలియాతో విశాఖ వేదికగా టీ–20 సిరీస్ ప్రారంభం అవుతుంది.

భారత్ తొలిసారిగా సోలోగా వరల్డ్ కప్‌కు ఆతిథ్యమిస్తోంది. ఇప్పటికే మూడు సార్లు భారత్ వేదికగా వరల్డ్‌కప్ క్రికెట్ పోటీలు జరిగాయి. మూడు సార్లూ మన సరిహద్దు జట్లతో కలిసి ఆతిథ్యమిచ్చాం. కానీ ఈసారి సోలోగానే భారత్ ఆతిథ్యమిస్తోంది. అయితే ఈ సారి టెస్ట్ నిర్వహించే అర్హత ఉన్న కొన్ని వేదికలకు ప్రపంచ కప్ మ్యాచ్‌లు నిర్వహించే అవకాశం దక్కలేదు. అలాంటి ఐదు నగరాల్లో బీసీసీఐ మూడు విదేశీ జట్లతో సిరీస్‌కు ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ఆస్ట్రేలియా జట్టు ప్రపంచకప్‌కు ముందు భారత్‌లో వన్డే సిరీస్ ఆడనుంది. వరల్డ్‌కప్ ముగిసిన నాలుగు రోజుల అనంతరం టీ–20 సిరీస్ ప్రారంభమవుతుంది. ఈ పొట్టి ఫార్మాట్ సిరీస్ విశాఖ వేదికగా నవంబర్ 23న ప్రారంభం కానుంది. ఇంగ్లాండ్‌తో టెస్ట్ మ్యాచ్‌ను ఇదే వేదికపై వచ్చే ఏడాది ఫిబ్రవరి 2 నుంచి 6 వరకు భారత్ జట్టు ఆడనుంది.

బీసీసీఐ కార్యదర్శికి ధన్యవాదాలు

విశాఖకు రెండు మ్యాచ్‌లు కేటాయించిన బీసీసీఐ కార్యదర్శి జై షాకు ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి ధన్యవాదాలు చెప్పారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరల్డ్ కప్ మ్యాచ్‌లకు విశాఖ వేదిక కాకపోవడాన్ని కౌన్సిల్ అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి.. జై షా దృష్టికి తీసుకువెళ్లారని చెప్పారు. జై షా ఇచ్చిన హామీ మేరకు ఆస్ట్రేలియాతో టీ–20 మ్యాచ్, ఇంగ్లాండ్‌తో టెస్ట్ మ్యాచ్‌కు అవకాశమిచ్చారన్నారు. కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో విశాఖ వేదికగా.. నిబంధనల మేర విజయవంతంగా మ్యాచ్ నిర్వహించడంతో తొలి ప్రాధాన్యమిచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. వైఎస్సార్ స్టేడియంలో ఇప్పటి వరకు 17 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో నాలుగు మ్యాచ్‌లు ప్రస్తుత కౌన్సిల్ పర్యవేక్షణలోనే జర్గా.. ఇప్పుడు మరో రెండు మ్యాచ్‌లు జరుగుతాయన్నారు. దేశవాళీ మ్యాచ్‌లకు విశాఖ వేదికగా నిలవనుందని వెల్లడించారు. కౌన్సిల్ కోశాధికారి ఎ.వి.చలం, సీఎఫ్‌వో నవీన్, గేమ్ పర్యవేక్షణాధికారి ఎంఎస్ కుమార్ పాల్గొన్నారు.

ఆటో ఫైనాన్స్ కంపెనీ అరాచకం

- వాయిదాలు చెల్లించలేదని కస్టమర్ నిర్బంధం
- డయల్ 100కు సమాచారం అందడంతో విడిపించిన పోలీసులు



సెల్లార్‌లో వ్యక్తిని బంధించిన ఆటోఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు



గాజువాక పంతులు గారి మేడ వద్ద గల పవన్ సాయి ఆటో కన్సల్టెన్సీ షోరూం

అక్కిరెడ్డిపాలెం: ఒక ఆటో కన్సల్టెన్సీలో వాహనం కొలుగోలు చేసిన వ్యక్తి రెండు నెలలుగా వాయిదాలు కట్టకపోవడంతో కన్సల్టెన్సీ నిర్వాహకులు ఆ వ్యక్తిని షోరూంకు పిలిపించి సెల్లార్‌లో బంధించారు. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాలివి. గాజువాక పంతులుగారి మేడ వద్ద గల పవన్ సాయి ఆటో కన్సల్టెన్సీ షోరూంలో గాజువాక హైస్కూల్ రోడ్డుకు చెందిన వ్యక్తి వాహనాన్ని కొనుగోలు చేశాడు. అయితే రెండు నెలలుగా వాయిదాలు చెల్లించకపోవడంతో అతనిని షోరూంకు పిలిపించిన కన్సల్టెన్సీ నిర్వాహకులు అతను రెండు నెలలు రూ.7336లను వాయిదా చెల్లించాల్సి ఉందని తెలిపారు. అయితే ప్రస్తుతం తాను వాయిదాలు చెల్లించే పరిస్థితిలో లేనని చెప్పడంతో ఆగ్రహించిన సిబ్బంది ఆ కస్టమర్‌ను షోరూం కింద ఉన్న సెల్లార్‌లో బంధించి గేటుకు తాళాలు వేశారు. దీంతో అతను డయల్ 100కు ఫోన్ చేయడంతో గాజువాక పోలీసులు షోరూంకు చేరుకొని బందీగా ఉన్న వ్యక్తిని విడిపించారు. తన పరిస్థితి బాగాలేదని, త్వరలోనే సొమ్ము చెల్లిస్తానని మొరపెట్టుకున్నా కన్సల్టెన్సీ నిర్వాహకులు వినలేదని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం వరకు తిండి తిప్పలు లేకుండా తనను బంధించారని తెలిపాడు. జరిగిన సంఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఆటో కన్సల్టెన్సీ యాజమాన్యంపై కేసు నమోదు చేశారు.

నకిలీ నేవీ కమాండర్ హల్‌చల్

- నేవీ యూనిఫాంతో నేవీ కార్యాలయ ప్రాంతాల్లో తిరుగుతున్న చలపతిరావు
- అనుమానం వచ్చి ప్రశ్నించిన నేవీ పోలీసులు
- నకిలీ అధికారి అని గుర్తించి మల్కాపురం పోలీసులకు అప్పగింత
- అతడిపై విజయవాడలో కూడా ఇదే తరహా కేసు

మల్కాపురం: నేవీ కమాండర్ యూనిఫాం ధరించాడు. దర్జాగా ఐఎన్ఎస్ సర్కార్, డాక్‌యార్డ్ ప్రాంతాల్లో గత మూడు రోజులుగా కలియతిరిగాడు. నకిలీ గుర్తింపు కార్డుతో నేవీ క్యాంటీన్‌లోకి వెళ్లి సామగ్రి కూడా కొనుగోలు చేశాడు. ఇదే తరహాలో బుధవారం కూడా నేవల్ క్యాంటీన్ వద్ద తిరుగుతుండగా నేవీ పోలీసులకు అనుమానం వచ్చి ప్రశ్నించారు. దీంతో అతడు నకిలీ అధికారిగా గుర్తించి వెంటనే మల్కాపురం పోలీసులకు అప్పగించారు. పోలీసులు అతడిని విచారించగా విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. వివరాల్లోకి వెళితే.. ఈస్ట్‌పాయింట్ కాలనీకి చెందిన చలపతిరావు నేవీ అధికారిగా అవతారమెత్తాడు. నకిలీ ఐడీ కార్డు సృష్టించాడు. గత మూడు రోజులుగా నిషేధిత నేవీ కార్యాలయాల ప్రాంతాల్లో తిరిగాడు. నేవీ క్యాంటీన్‌లోకి వెళ్లిన సందర్భంలో కూడా అక్కడున్న సిబ్బందికి కమాండర్‌గా పరిచయం చేసుకున్నాడు. రోజూ మాదిరిగానే బుధవారం కూడా నేవీకి చెందిన తృప్తి క్యాంటీన్ వద్ద చలపతిరావు అనుమానాస్పదంగా తిరుగుతుండగా నేవీ పోలీసులు గుర్తించారు. అనుమానం వచ్చి అతడిని ప్రశ్నించగా తాను కమాండర్‌ను అని సమాధానమిచ్చాడు. ఎక్కడ విధులు నిర్వర్తిస్తున్నాడని, ఐడీ కార్డు ఇతర వివరాలను ఆరా తీయగా అవన్నీ నకిలీ అని తెలుసుకున్నారు. వెంటనే చలపతిరావును మల్కాపురం పోలీస్‌స్టేషన్‌కు అప్పగించి అతడిపై ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు చలపతిరావును విచారించగా అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. నేవీ అధికారి పేరుతో విజయవాడలో కూడా హల్‌చల్ చేసిన వ్యవహారంలో అతడిపై కేసు నమోదైనట్లు తెలుసుకున్నారు. అలాగే అగ్నివీర్ కింద చేపట్టే నియామకాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పలువురు నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు గుర్తించారు. దీంతో ఈ కేసును మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయినితో పాటు ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. బుధవారం ఇస్లాంపేట పాఠశాలను సందర్శించిన డీఈవో ఆ పాఠశాలలో చేపట్టిన నాడు–నేడు పనులను, హిందీ సబ్జెక్ట్ కాంప్లెక్స్, ఉర్దూ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. తరగతుల నిర్వహణ, జేవీకే కిట్ల పంపిణీ, జీఈఆర్ సర్వేపై ఆరా తీశారు. సిలబస్ ఎంత వరకు వచ్చిందని అడిగి తెలుసుకున్నారు. అయితే ఉపాధ్యాయుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఆమె అసహనం వ్యక్తం చేశారు. వారి పనితీరు బాగా లేదంటూ షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

బడిబయట పిల్లలను బడిలో చేర్పించిన డీఈవో

బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ అన్నారు. పాఠశాలకు వెళ్లకుండా ఇంటికే పరిమితమైన విద్యార్థులు ఎలక జోత్స్న, దీవెన, సి.నిర్మల్ అనే ముగ్గురిని గుర్తించారు. వారిని ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ఎంఈవోలు శ్రీనివాసరావు, రమణాజీ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, రామలక్ష్మి పాల్గొన్నారు.

28న ఆర్.కె.బీచ్‌లో 'లివర్ వాక్'




మాట్లాడుతున్న కేజీహెచ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాధిపతి గిరినాథ్

మహారాణిపేట: ప్రపంచ హైపటైటిస్ డే సందర్భంగా ఈ నెల 28న ఒకే జీవితం, ఒక కాలేయం అనే నినాదంతో ఆర్.కె. బీచ్‌లో 'లివర్ వాక్' నిర్వహిస్తున్నట్టు కేజీహెచ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగాధిపతి డాక్టర్ ఎల్.ఆర్.ఎస్ గిరినాథ్ తెలిపారు. కేజీహెచ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో బుధవారం ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, మైక్రోబయాలజీ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ సుజాతతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ రోజు లివర్ వాక్‌తో పాటు ఫ్లాష్‌మాబ్, ఉచిత స్క్రీనింగ్ క్యాంపెయిన్, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2002 కంటే ముందు జన్మించిన వారికి కేజీహెచ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో ప్రతీ బుధవారం ఉచిత హైపటైటిస్ వ్యాక్సినేషన్ వేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 18 వేల మందికి పైగా టీకాలు వేశామని వెల్లడించారు.

ముడసర్లోవకు జలకళ

ఆరిలోవ: ముడసర్లోవ రిజర్వాయర్‌కు జలకళ వచ్చింది. మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రిజర్వాయర్‌లోకి నీరు చేరి మూడు అడుగుల మేర పెరిగింది. ఈ రిజర్వాయర్ సామర్థ్యం 170 అడుగులు కాగా.. మూడు రోజుల కిందట వరకు 161 అడుగుల మేర నీరు ఉంది. వర్షాలతో బుధవారం నాటికి 164 అడుగులకు నీటి మట్టం పెరిగినట్లు ముడసర్లోవ నీటి సరఫరా విభాగం ఏఈ అప్పాజీ తెలిపారు.



కొత్త నీరు చేరికతో కళకళలాడుతున్న ముడసర్లోవ రిజర్వాయర్

త్యాగధనుల కీర్తిని చాటిన 'భారతీయం'

కార్గిల్ వీరులను సత్కరించిన మంత్రి అమర్‌నాథ్



కార్గిల్ యుద్ధంలో గాయపడిన సైనికుడిని సత్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్



దేశ భక్తి గీతానికి నృత్య ప్రదర్శన

మద్దిలపాలెం: కార్గిల్ యుద్ధంలో ప్రాణాలు త్యాగం చేసిన ధీరుల చరిత్ర ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా గెయిల్, ఎస్ఆర్‌కే సంస్థల సౌజన్యంలో యాక్మీ సంస్థ 'భారతీయం' పేరిట బుధవారం కళాభారతి ఆడిటోరియంలో వేడుకలు నిర్వహించింది. ముందుగా మేయర్ గొలగాని హరి వెంకట కుమారి జ్యోతి ప్రజల్వన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో ప్రాణాలు ఫణంగా పెట్టి దేశానికి విజయం అందించిన సైనికుల త్యాగాలు మరువలేనివన్నారు. మంచు పర్వతాల్లో దాదాపు 60 రోజుల పాటు జరిగిన యుద్ధంలో 527 మంది భారత సైనికులు అమరులయ్యారని తెలిపారు. దేశం కోసం యువత రక్షణ దళాల్లో చేరాలని పిలుపునిచ్చారు. మేయర్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన సైనికులను స్మరించుకోవడం మన బాధ్యత అన్నారు.

కార్గిల్ వీరులకు ఘన సత్కారం

కార్గిల్ యుద్ధంలో పాల్గొని గాయాలపాలైన బ్రిగేడియర్ ప్రమోద్‌కుమార్ దాస్, హవల్దార్లు నీలాచలం, చిన్నం సింహాచలంను మంత్రి అమర్‌నాథ్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అద్భుతంగా సాగాయి. స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ బృందం ప్రదర్శించిన శక్తివంతమైన భారతీయం నృత్యరూపకం అందరినీ ఆకట్టుకుంది. సైనికులుగా విశాఖ వ్యాలీ విద్యార్థుల ప్రదర్శన దేశ స్ఫూర్తిని రగిలించింది. భరతనాట్యం, కూచిపూడి కళాకారులు.. దేశ త్యాగధనుల కీర్తిని చాటుతూ చేసిన నృత్య ప్రదర్శలు అబ్బురపరిచాయి. యాక్మీ సంస్థ వ్యవస్థాపకుడు ప్రతాప్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాభారతి అధ్యక్షుడు మంతెన సత్యనారాయణ రాజు, గెయిల్ చీఫ్ జనరల్ మేజర్ ఎల్.ఎస్.రావు, సైనిక్ వెల్ఫేర్ డైరెక్టర్ వి.వెంకట్‌రెడ్డి, మట్టపల్లి సత్యనారాయణ, విశాఖ వేలీ స్కూల్ ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

విశాఖ బులియన్

24 క్యారెట్స్(10 గ్రా.)	రూ.60,160
22 క్యారెట్స్(10 గ్రా.)	రూ.55,150
వెండి(కిలో):	రూ.80,400

చికెన్ ధరలు



చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	: రూ.95
బ్రాయిలర్ (లైవ్)	: రూ.115
స్కిన్	: రూ.200
స్కిన్‌లెస్	: రూ.210

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	475.00
విజయనగరం	479.00
శ్రీకాకుళం	479.00